క్లుప్తంగా

సేవలు అభినందనీయం



అదనపు తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడుతో పూర్వ విద్యార్థులు

నిడదవోలు: తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు ప్రభుత్వ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.25 లక్షలతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు రంగుల చెల్లారావు, కార్యదర్శి ఎ.రాజేశ్వరరావు, శమంతకమణి, అప్పారావు, గాజుల సత్యనారాయణ, బండి ప్రసాద్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే క్షయ ప్రమాదకరం



కానూరు అగ్రహారంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హేమరాజు

పెరవలి: క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హేమరాజు తెలిపారు. కానూరు అగ్రహారంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం ఆ గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వ్యక్తికి దగ్గు, ఆయాసం, ఆకలి లేకపోవటం, నిద్ర పట్టకపోవటం, నీరసం, జ్వరం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. జ్వరం వారం రోజులైనా తగ్గకపోతే పీహెచ్‌సీలో కళ్లె పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం రూ.20 వేల విలువైన మందులను ఉచితంగా అందిస్తుందన్నారు. క్షయ వ్యాధి ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ క్షయ రోగికి పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం నెలకు రూ.500 ఇస్తుందన్నారు. సర్పంచ్ దాసం వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు దాసం బాపన్న, పీహెచ్‌సీ సిబ్బంది నాగేశ్వరరావు, స్నేహ, రాజేశ్వరి పాల్గొన్నారు.

బాధితులకు 'మానవత' సాయం



చీపురుగూడెంలో బాధితుడికి సాయం చేస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: చీపురుగూడెంలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఆదివారం మానవత సంస్థ చేయూతనిచ్చింది. గాలింకి శ్రీను, జాలాది దుర్గ, జాలాది వెంటేషలకు ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, మండల శాఖ అధ్యక్షులు ఐడీవీ అప్పారావు, నందం రాజేంద్రప్రసాద్, గుళ్లపూడి వెంకటరత్నం, తలంశెట్టి మాధవరావు, గాలింకి రాంబాబు, ప్రత్తిపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

కొవ్వూరు: కిడ్నీ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాని, వెంటనే వైద్యులను సంప్రదించాలని మధుమేహ వ్యాధి నిపుణుడు డాక్టర్ కె.ప్రదీప్ అన్నారు. ఆదివారం స్థానిక వాటర్ ట్యాంకు సమీపంలో గండ్రోతు పవన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన లోటస్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య సేవలందించారు. శిబిరానికి వచ్చిన రోగులకు షుగర్, బీపీ పరీక్షలు చేశారు. వైద్య సేవలందించిన ప్రదీప్‌ను సత్కరించారు.

టీవీ, సినీ నటుడు వాజ్‌పేయ్ కన్నుమూత



వాజ్‌పేయ్(ఫైల్)

కొవ్వూరు: పట్టణానికి చెందిన టీవీ సీరియల్, సినిమా నటుడు వాజ్‌పేయాజుల సత్యసాయి(ఎస్ఎస్ వాజ్‌పేయ్)(70) గుండెపోటుతో ఆదివారం గౌతమీనగర్‌లోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అపకర్మల కోసం ఆత్మీయ హితకారిణి సమాజం ఏర్పాటు, జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని నిర్మించారు. గతంలో రెండు పర్యాయాలు సెన్సార్ బోర్డు మెంబర్‌గా కూడా పనిచేశారు. పలు సినిమాల్లోను, టీవీ సీరి యల్స్‌లో నటించారు. ప్రస్తుతం మాటీవీ ప్రసారం అవుతున్న నాగ పంచమి, జీ తెలుగులో కల్యాణ వైభోగంతో పాటు పలు సీరియల్స్‌లో కీలక పాత్రలు పోషించారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వాజీపేయం సంస్థ అధ్యక్షుడిగాను పనిచేస్తున్నారు. ఆయన మృతికి పలువురు పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలు సోమవారం కొవ్వూరులో నిర్వహించనున్నారు.

సాధికార నీరాజనం



సామాజిక సాధికార యాత్రకు కదిలివచ్చిన ప్రభం'జనం'లో ఓ భాగం



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- సామాజిక సాధికార బస్సు యాత్రకు అపూర్వ స్పందన
- కదంతొక్కిన పార్టీ శ్రేణులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో దద్దరిల్లిన దేవరపల్లి

దేవరపల్లి/ నిడదవోలు రూరల్/ చాగల్లు/ గోపాలపురం: అభిమానం ఉవ్వెత్తున ఎగసిపడింది.. వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పార్టీ శ్రేణులు కదిలి రావడంతో దేవరపల్లి జన కెరటంలా మారింది.. ఎక్కడ చూసినా వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి.. పార్టీ శ్రేణులు నూతనోత్సాహంతో కదం తొక్కారు. పార్టీ విజయానికి మేము సైతం అంటూ ముందుకు కదిలారు.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లిలో ఆదివారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు పోటెత్తారు. దేవరపల్లి, ద్వారకాతిరుమల, నల్లజర్ల, గోపాలపురం మండలాల నుంచి పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చారు. జగనన్న అండతో తాము సాధించిన సాధికారతను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగుండాలంటే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా అంతా పనిచేద్దామని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇంతవరకూ ఏ ప్రభుత్వం చేయని సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యమైందని వివరించారు.

అడుగడుగునా నీరా'జనాలు'

దేవరపల్లి మండలం కృష్ణంపాలెం నుంచి సాధికార యాత్ర ప్రారంభం కాగా ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. బస్సుకు ముందు వేలాది మంది యువకులు బైక్‌లపై ర్యాలీగా సాగారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. బస్సు యాత్రలో మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, ఎంపీలు మార్గాని భరత్‌రామ్, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, ఉన్నమట్ల ఎలీజా, నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు హాజరై మాట్లాడారు. పార్టీ విజయమే అజెండాగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, బంకా జయలక్ష్మి, బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యులు పొట్టి స్వర్ణలత, కాకులపాటి లలిత, ముప్పిడి లక్ష్మి, చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల అధ్యక్షులు కూచిపూడి సతీష్, కె.నాగరాజు, గగ్గర శ్రీనివాస్, వాసుబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభాజన విభాగం కార్యదర్శి కారుమంచి రమేష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీగా తరలివస్తున్న యువత



సామాజిక సాధికార యాత్రలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్లకు శ్రీరామ జన్మభూమి అక్షతలు



అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షతలు, కరపత్రాలు, ఫొటోలతో భక్తులు

నల్లజర్ల: అయోధ్య శ్రీరామ మందిరం గ్రౌండ్ ఫ్లోర్ గర్భగుడిలో బాలరాముని నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ వచ్చే జనవరి 22న జరుగనుంది. అదేరోజు దేశవ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని రామాలయాల్లో నిర్వహించాల్సిన ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరిస్తూ శ్రీరామ జన్మభూమి ట్రస్టు నుంచి కరపత్రాలు, ఫోటోలు నల్లజర్లకు చేరాయి. భక్తులకు విశ్వహిందూ పరిషత్ గోరక్ష జిల్లా ప్రముఖ్ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో వీటిని అందించనున్నారు. నల్లజర్ల శాఖ అధ్యక్షుడు కందుల రవిశేఖర్, కార్యదర్శి బదిరెడ్డి నాగేశ్వరరావు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు, నల్లజర్ల గ్రామ కమిటీ అధ్యక్షులు మాయలేటి తాతారావు, సవలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అయోధ్య శ్రీరామ మందిరం నుంచి వచ్చిన పవిత్రమైన అక్షతలు అన్ని గ్రామాల్లో పంపిణీ చేస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ అడ్డా శ్రీరామ్ మోహన్ తెలిపారు. తాళ్లపూడి శివాలయం వద్ద ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ మండల ప్రముఖ్ బొర్రా శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పెరవలి: అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు, కరపత్రికలు పంపిణీ చేస్తున్నామని విశ్వహిందూ పరిషత్ సభ్యుడు తుట్టగుంట అచ్యుతరామయ్య తెలిపారు. ఈ మేరకు పెరవలిలో ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ అయోధ్యంలో జనవరి 22న రాముని ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

పశుగ్రాసం కొరత తీర్చేందుకు చర్యలు

- హోం మంత్రి తానేటి వనిత
- రైతులకు పశువుల దాణా పంపిణీ

కొవ్వూరు: మిచాంగ్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఏర్పడిన పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా రైతులకు ఉచితంగా పశు సమీకృత దాణాను అందిస్తుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఆదివారం కొవ్వూరులోని పశువుల ఆసుపత్రి వద్ద రైతులకు దాణా పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సుమారు 300 మంది రైతులకు రూ.12 లక్షల విలువైన దాణాను ప్రభుత్వం ఉచితం అందిస్తుందని మంత్రి తెలిపారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్‌టీజీ సత్యగోవింద్ మాట్లాడుతూ ఒక్కో రైతుకు గరిష్టంగా వంద కిలోల చొప్పున దాణా అందిస్తున్నామన్నారు. కొవ్వూరు నియోజకవర్గానికి 75 టన్నుల దాణా వచ్చిందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, పశు సంవర్ధక శాఖ డీడీ జి.రాధాకృష్ణ, ఏడీ ఎ.వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఎ.దొరయ్య, నాయకులు గోలి శ్రీనివాస్, తోట రామకృష్ణ, మద్దుకూరి రవి, ఉప్పులూరి సూరిబాబు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పెరవలి: పాడి రైతులకు ప్రభుత్వం భరోసా అందిస్తుందని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తెలిపారు. ముక్కామలలో రైతులకు పశుదాణా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తుపాన్ సమయంలో పశువులకు పశు వైద్యాధికారులు విశేష సేవలు అందించారన్నారు. పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ పెరవలి మండలానికి రూ.4.66 లక్షల విలువైన 25 టన్నుల దాణా ప్రభుత్వం నుంచి వచ్చిందన్నారు. పశు వైద్యాధికారి చరణ్ మాట్లాడుతూ ఖండవల్లిలో 320 మంది, ముక్కామలలో 180 మంది రైతులకు ఈ దాణా అందజేశామన్నారు. సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేండ్ర శ్రీనువాస్, ముక్కామల పశు వైద్యులు సోమేశ్వరి, బీహెచ్ రమేష్ పాల్గొన్నారు.



కొవ్వూరులో పశువుల దాణా పంపిణీ చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత



ముక్కామలలో పశు దాణా అందజేస్తున్న ఎంపీపీ ప్రసాద్, రాధాకృష్ణ

ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఆదివారం కె.సావరం గ్రామంలో పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, బుక్‌లెట్లను అందజేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలకు మాత్రమే మేలు జరిగిందని, నేడు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలు మంగళ హారతులతో స్వాగతిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు మోసపూరిత హామీలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. వారికి వచ్చే ఎన్నికల్లో ఓటర్లే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, బస్వా రామన్నరావు, బస్వా జగన్, మేడిద సోమసుందర్, బస్వా వరప్రసాద్, సఖినాల రామకృష్ణ, బస్వా శ్రీనివాసు, రామాయణం శ్రీనివాసు, అడబాల విజయ్‌కుమార్, రాపాక రమాదేవి, అడబాల సత్య తదితరులు పాల్గొన్నారు.



కె.సావరంలో మహిళకు పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కల్యాణం.. వైభోగం

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

పెరవలి: అన్నవరప్పాడులో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. 108 కలశాల్లో వివిధ నదీ జలాలను తీసుకు వచ్చి స్వామి అమ్మవార్లకు అభిషేకం చేశారు. హోమం అనంతరం స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. అర్చకుడు వెలవలపల్లి కాశీవిశ్వనాథం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఉండ్రాజవరం: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రి స్వామివారికి కల్యాణం కనుల పండువగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి తరించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ బత్తిన వీరవెంకట సత్యనారాయణ (భూరయ్య) మాట్లాడుతూ సోమవారం షష్ఠి సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశామని, 19న ఉదయం స్వామివారికి త్రిశూలస్నానం, వసంతోత్సవం, సాయంత్రం సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఏఓ ఎం.వెంకట్రావు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లపూడి: ప్రక్కిలంక విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకుడు కొతవరపు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి కల్యాణం జరిపారు. వేగేశ్వరపురంలోని ఛాయసోమేశ్వరస్వామి ఆలయం వద్ద, పెద్దేవంలోనూ కల్యాణం జరిగింది.

షష్ఠి మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

కొవ్వూరు: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్ఠి మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సుదర్శన, మూల మంత్ర సహిత కాలసర్ప, సుబ్రహ్మణ్య లక్ష్మీ గణపతి హోమం, రాజశ్యామల హోమం నిర్వహించారు. సోమవారం స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు దేవరకొండ సాయిప్రసాద్ తెలిపారు. గోష్పాద క్షేత్రంలో సుందరేశ్వస్వామి ఆలయంలో, సంస్కృత పాఠశాల ప్రాంగణంలో గోష్పాదేశ్వరస్వామి ఆలయంలోని ఉప ఆలయాల్లో సోమవారం సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు.



కొవ్వూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో రాజశ్యామల యాగం

బోల్తా పడిన శాంతి రథం



అచ్చన్నపాలెం వద్ద బోల్తాపడిన శాంతి రథం

నల్లజర్ల: వృద్ధుడి మృతదేహానికి కొవ్వూరులో అంత్యక్రియలు చేసేందుకు వెళ్తున్న మానవత శాంతి రథం (వ్యాన్) బైపాస్ రహదారిపై అచ్చన్నపాలెం వద్ద బోల్తా పడింది. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం నుంచి వృద్ధుని మృతదేహాన్ని ఫ్రీజర్‌తో తీసుకువెళ్తున్న మానవత శాంతి రథాన్ని మరో వాహనం ఓవర్ టేక్ చేయబోయి మీదకు వస్తుండటంతో శాంతిరథం డివైడర్‌ను ఢీకొట్టి రహదారికి అడ్డంగా పల్టీకొట్టింది. ఈ సంఘటనలో శాంతి రథంలో ఉన్న మృతదేహం రోడ్డుపై పడింది. డ్రైవర్‌తో పాటు మృతుని బంధువులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరికి నల్లజర్ల పీహెచ్‌సీలో వైద్యం చేశారు. అనంతరం నల్లజర్ల మానవత శాంతి రథంలో మృతదేహాన్ని తీసుకెళ్లి పోతవరం హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు.



పూజ చేయగ.. మది మురవగ

- ధనుర్మాస పూజలు ప్రారంభం
- వైష్ణవ ఆలయాల్లో భక్తుల రద్దీ

నల్లజర్ల: పవిత్ర ధనుర్మాసం వచ్చేసింది. ఆధ్యాత్మిక సంబరాలు తెచ్చేసింది.. ఆదివారం నుంచి వైష్ణవ ఆలయాల్లో ఈ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతపల్లిలోని రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీమదనగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.17 గంటలకు నెలగంట వేడుక నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు దివి పాండురంగశర్మ తెలిపారు. వచ్చే నెల 16 వరకూ రోజూ తెల్లవారుజామున 4.30 గంటలకు తిరుప్పావై పాశుర పారాయణ, 5 గంటల నుంచి ప్రవచనం, అర్చన, సేవాకాలం, తీర్థప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారదర్శనం, గిరి ప్రదక్షిణ ఉత్సవాలు జరుగుతాయన్నారు. గోదా అమ్మవారికి కుంకుమార్చనలు, సామూహిక కుంకుమ పూజలు 14న ఉదయం గోదారంగనాథుల కల్యాణోత్సవంతో ధనుర్మాస ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

కొవ్వూరు: స్థానిక వరద గోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి సుప్రభాత సేవ, విష్ణు సహస్రనామ స్తోత్రం, లక్ష తులసిపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కోట వెంకటేశ్వర్లు, సరోజిని దంపతులు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎం.బాలకృష్ణ తెలిపారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అదేరోజు ఉత్తరద్వార దర్శనం, గరుడోత్సవం, సంపూర్ణ గీతా పారాయణ, అఖండ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ జరుగుతాయన్నారు. ఆలయ అర్చకుడు గోవర్ధనం శ్రీనివాసమూర్తి, పలువురు పండితులు పూజలు చేశారు.



అనంతపల్లి మదన గోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

పెన్షనర్లకు అండగా ఉంటాం



సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న సభ్యులు

నల్లజర్ల: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎం ఆలీసాహెబ్ అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లజర్ల జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలీసాహెబ్ మాట్లాడుతూ సమగ్ర పెన్షన్ కోసం డీఎస్ నకారా సుప్రీంకోర్టును ఆశ్రయించి విజయం సాధించారన్నారు. నకారా, వైవీ చంద్రచూడ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులు సత్యనారాయణ రాజు, సపూరాబీలను సత్కరించారు. అధ్యక్షుడు ఐవీ సత్యం, ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, నెక్కలపూడి ప్రతాప్, ఎస్.దత్తు, ఎస్.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: పెన్షనర్లకు అండగా ఉంటానని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా నిడదవోలులోని అమ్మిరాజు సత్యనారాయణ మున్సిపల్ బీసీ కమ్యూనిటీ హాల్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అడబాల నరసింహ కొండలరాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 75 ఏళ్లు నిండిన పెన్షనర్లను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొండా నిర్మల మాట్లాడారు. అనంతరం 8 మంది పెన్షనర్లను ఎమ్మెల్యే సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాసు, విద్యుత్ శాఖ డీఈ బలభద్ర వీరభద్రరావు, కార్యదర్శి శింగులూరి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.